# వెలుగు నీడలు

(పరిచర్యలో శ్రమల స్వీయానుభవము)

రచయిత:

కీ॥శే॥ **పాస్టరు పురుషోత్తము చౌధరి**

శతజయంతి (1906-2006) ప్రచురణ

ప్రచురణ కర్త:

**జేమ్సు జయశీల్ చౌధరి**

# వెలుగు నీడలు

## 1. స్వీయ చరిత్ర

తే॥గీ॥ పుట్టియుంటిని సాలూరు - మట్టి పైని
వాస మాకులతంపర -వైభవముగ
చేరుకొంటిని ప్రభుసేవ - చింతతోడ
పర్ల పురి సంఘ పాస్టరు - పదవియందు

తే॥గీ॥ కలిమి లేములు పనిలోన - కలుగుచున్న
దైవ నడిపింపులో నేను - తెరలు కొనుచు
చేసుకొంటిని విలువగ - జీవితమును
పరిగె పురుషోత్త నామంబు - పర్లపురిలో

తే॥గీ॥ పదిని మూడుచేగుణించి - పరగదాని
ఎనిమిదిని కలపనున్నన్ని -ఏండ్లులందు
పర్లపురి సంఘమందున - పాలకునిగ
ప్రభుని సేవించుచుంటిని - భాగ్యముగను

తే॥గీ॥ సాధ్యపడెనయ్య స్థాపింప - సంఘమొకటి
రౌతుపుర గ్రామమందు - ననవరతము
ప్రభుని కృపలందు వారల - బ్రతుకునందు
భక్తి మర్యాదలను గల - భాగ్యమొంది

తే॥గీ॥ సియాలుటి గ్రామాన - స్థిరముగాను
స్థాపితమయ్యెరెండవ - సంఘమొకటి
ప్రభునివాక్యసారము - ప్రభలమయ్యె
నమ్మికొంటిరిప్రభుయేసు - నామమందు

తే॥గీ॥ మూడవసంఘమింకొకటి - ముదముగాను
కింగగ్రామము క్రైస్తవుల - సంగతెరిగి
నమ్మికుంటిరి ప్రభుయేసు - నామమందు
క్రమముతప్పకనిలిచిరి - క్రైస్తవులుగా

తే॥గీ॥ వందలాదిగముంచడముల్ - పొందినారు
కొండ సీమల జనులెల్ల - దండిగాను
ప్రాకె పరిశుద్ధ వాక్యంబు - ప్రభలముగను
ఆంధ్రపర్వతసీమల - హద్దుదూరి

తే॥గీ॥ చౌధరీవంశ జ్యేష్టుడు - జగన్నాథ
డతని పుత్రుడు గోపినాథ్ - దనగ బరిగె
వాని సుతుడగు దానియేల్ - వరుసయందు
లలిత, రాజు, పురుషోత్తము - లతడు కనెను

తే॥గీ॥ తాత గోపినాథు కొడుకు మా తండ్రిగారు
తాత కొడుకులు వేరుగా - దద్దలుండె
తాత సంబంధ మీ రీతి -ధరణి కలిగె
తాత గారికి నేజేతు - దండమెపుడు

తే॥గీ॥ తండ్రిగారిని దలిచి నే - దండ మిడుదు
తల్లి ప్రేమను హృదయాన - తలచినపుడు
భక్తి జాడలు మనసులో - పొగిలివచ్చి
పాద పద్మంబులకు జేతు - ప్రణతు లివియె

తే॥గీ॥ అమ్మ మరుపుకు రావమ్మ - అంటెనమ్మ
భువిని దైవంబు తరువాత - పూజసేయు
దైవ మీవమ్మ నే నెపుడు - తలచుచుందు
దీవెనలు పంపు మాయమ్మ - దివ్యమూర్తి

తే॥గీ॥ అమరలోకాన నున్నావు - ఆత్మరీతి
స్టేన్లీసంపదు మనవుని - చేర్చుకొంటివి
అకట! నాతండ్రి నీకడకు - అరిగినాడు
తాతగారితో మీరంత - ధన్యులైరి

తే॥గీ॥ చావుపుట్టుకలేనట్టి - జగతియందు
యేసుదేవునితో గూడి - భాసురముగ
నిత్యమానందముననుండు - మిముల జేర
వేచియున్నాను కాలంపు - వేగిరముకై

గీ॥ తమ్ముడొక్కడెనాకుండె - ధరణి వీడి
తరలిపోయెను మాతల్లి - తండ్రికడకు
వారలున్నారుపరలోక - వాసమందు
వారలనుజేర నాచెల్లి - విడిచె భువిని

గీ॥ అన్నదమ్ముడు తలిదండ్రి - అక్కచెల్లి
భువిని నున్నప్పుడు నాయందు - భూరిదయతో
ధైర్యపరచుచు కష్టాల - దారినుండ
మిక్కిలిగా సాయపడిరెంతో - మరువగలన

గీ॥ ఒక్కనిగ నుండిపోతిని - దిక్కులేక
దేవుడొక్కడే నాకయ్యె - దిక్కుయిచట
కలిమినొసగియు నాకున్న - కష్టములను
తొలగజేసియు రక్షించె - ఇలనునన్ను

గీ॥ చెడ్డగుణములేమున్న మనసులో - చెరిపివేసి
మోక్షమున జేర్చుకొనుటకు - మదినికోరి
వేచియున్నాను అనుదినము - విసుగులేక
దైవమెప్పుడు పిలుచునో - ధరణినుండి

## 2. పుత్రశోకము

సీ॥ అన్నలక్కయ్య గూడి - ఆనందహృదయాన
తాతగారింటికి - తరలినపుడు
బంధువుల్ నీయందు - భద్రమతులుంతురని
అమ్మనాయనలు నిన్న -ంపినపుడు
తిరిగి వచ్చెదనంచు - పొరుగింటనున్న నీ
చెలికాండ్రకడ నీవు - సెలవు నొంది
అందరి కన్నను - ముందు శకటంబెక్కి
నందు నాసీనుడై - యతిముదమున

గీ॥ చిందు లాడగమోమునా - నందమెంతో
తరలిపోతివి కనుమేర - తండ్రిచూడ
మరుదినంబున నీయొక్క - మరణవార్త
గర్భమున చిచ్చుపెట్టెరా - కన్న కడుకా!

గీ॥ తండ్రి నెన్నడు విడువని - తలపుగలిగో
తిరిగి పోయెద నంటివట - మరుదినమున
కనుల నీరొల్క యేడ్వ హే - కన్నకొడుకా
తలపుకది రాగా కన్నీటి - ధారలొలుకు

సీ: క్రీడావినోదమున - తోడిబాలురగూడి
మరుపొందితివా దు:ఖ - మంతరించ
కొంతకాలంబిట్లు - వింత క్రీడలమునిగి
వంశద్ధారానది - వద్దకరిగి
స్నానమాడగనాశ - జనియింప మదినీకు
నీట దిగితివా - యాటలాడ
నీరు లోతని యహో - నీతోటివారలు
యాల తెలుపలేద - యెరుకలేక

గీ: లోతు నీటను మునుగుచు - భీతితోడ
పాప పాపయన్న నీ - పలుకువిన్న
అక్క నిను దీయ యత్నించి - యందు జిక్కె
కడకు గట్టెక్కె నిను వీడి - కన్నకొడుకా

(దైవముతోవాదము)

గీ॥ కటా!కటా! ప్రాణముల్ పోవు - కాలమందు
ఎంతగా బాధపడితివో - ఎరుగనైతి
దైవమైనను రక్షింప - తలపలేద
కల్మషంబేమి యెరుగని - కన్నకొడుకా!

గీ॥ లోకులెల్లరు నీమృతికి - శోకమొంది
దైవచిత్తంబు ఈ రీతి - తారసిల్లె
ననుచు పలికినమాటలు - మనసునందు
శూలమై దూరె గర్భాన - తాలుటెటుల

గీ॥ దేవుడే ప్రేమ మూర్తియని - చెప్పుకొనుట
సామెతయ్యెను జనులకు - సతతమిలను
కటాకటా నాదు బిడ్డడి - కఠినమృతిని
తలప నిను ప్రేమమూర్తిగ - తలపగలనె

గీ॥ తగవు కల్గెన నీతోడ - తలప దీని
వాదమాడగ వచ్చితి - భాధ కలిగి
మరియసుత నీతో ముగ - మాటమేల
మెట్టవేదాంతములనాకు - గిట్టవయ్యా

గీ॥ తలచి కీడుచేయగ, నీవు - తలప తగదు
తిరగి దానికై నిన్ను నే - తిట్టతగదు
ఇట్టి సంబంధములమధ్య - పెట్టినావా
లేక నీవెవడా నరుడెవడో - లేదు తలప

గీ॥ కాన నిష్టురాలాడ సమ - కట్టినాను
చేయనున్నది ఏమున్న - చేసు కొనుము
పక్షపాతంబు గలదని - బయలుపెట్టి
నింద సేయంగమాన నిను - నిశ్చయంబు (రోమె 8:28)

గీ॥ జలధి గర్భంబులోనికి - జారుచుండి
భీతితో పేతురుడు నిన్ను - పిలచినపుడు
జాలినొందుచు కరమును - జాచినీవు
చావులో నుండి తప్పించి - నావుగావె

గీ॥ అట్టి నీహస్తముల నెవడు - కట్టినాడు
మందగించిన నీ వీనులు - ఎందుకయ్య
నాదు బిడ్డడాపదలోన - నరచువేళ
తరలి రక్షించకుంటివి - దైవమీవు

గీ॥ బొంకులెరగడా పేతురు - బొంకినట్లు
జేరిగద్దింప నిన్నెపుడు - జేరడనుచు
జాలి చూపకపోతివా - బాలునెడల
ధర్మమా లేక యిదినీదు - దైవగుణమా?

గీ॥ కలిసి వేడెనే నాయీను - గ్రామ విధవ
తనదు పుత్రుని బ్రతికింప - తరలినావు
నాదుపుత్రుని రక్షింప - నాదరంబ
శక్తిహీనతతో మరి నీ - చేతగాకో

సీ: మార్తమరియమ్మలు -మన్ననతో నిడిన
ప్రియవిందు కుడిచిన - ప్రీతివలనో
అచ్చుజటామాంసి అత్తరు - మరియమ్మ
పాదాల కలుమునను - వాంఛవలనో
సీమోను గృహమున - ఆమోదమైనట్టి
విందుకై నీలోన - వేడ్కగలిగో
కరుణతో నీపాద - సరసిజముల నొత్తు
నను, మరియ సేవకై - ఆశనొందో

గీ: మూడునాడులు గోతిలో - ములిగియున్న
లాజరును లేప పరిగెత్తి - నావు నీవు
నాదు సంపత్కుమారుని - మీదకెత్త
తడవుచేయుట నీకది - తగున దేవా

సీ: కోరియుందువేని - కొదువ లేకున్నన్ని
విందులు నీకు గా - వించి యుందు
కోరియుందువేని - కొదువ లేకున్నన్ని
వాసనత్తరులెన్నో - పూసియుందు
కోరియుందువేని - కొదువలేకున్నన్ని
భక్ష్యముల్ కుప్పలుగ - పరచియుందు
కోరియుందువేని - కొదువ లేకున్నంత
సేవ నీ క్రిందనే - చేసియుందు

గీ: కోరకుండగనే నాపైని - కోపగించి
పాపమెరుగని నా చిన్న - బాబునకటా!
చావునుండి బ్రతికించి - నావుకావు
పక్షపాతివిగాదకో - రక్షకుండా

గీ:	ముద్దుమాటల నాటల - ముద్దుగొలిపి
తల్లిదండ్రుల రంజించు - పిల్లవాని
జీవితమునకు లోకాన - తావులేదా?
ఈర్ష్యకలిగెను నీకేల - ఈశ్వరుండా

గీ॥	నాదు పితరులు నీసేవ - నయము మీర
జేసి నీ రాజ్యసేవలో - చెలగలేదా
అట్టి వంశ వృక్షంబున - బుట్టియున్న
మొగ్గనక్కట తురుముట - ఎగ్గుగాదె.

గీ॥	పూర్ణవికసితమైనట్టి - పువ్వు కోయ
ధర్మమని చెప్ప నయ్యది - తగునుగాని
లేతమొగ్గను తురిమితి - వాతురముతో
ఏమి చేతువో నేనది - యెరుగకుంటి

గీ॥	మాసములు నిండువరకు - భాసురముగ
గర్భమందే నే యాపద - కలుగకుండ
పుడమిపై నేడువర్షముల్ - పూర్తిదనుక
గడసి కాపాడితివిగాదె - కరుణజూపి

గీ॥	నిన్నుప్రార్థింప నేర్పించి - నీదువాక్య
పఠనమందున భక్తి - తత్పరునిజేసి
పెంచుచుంటిమిగాదకో - పేర్మితోడ
లోపమెచ్చట గలిగె త్రి - లోకనాథా

గీ॥ ధరణి దీర్ఘాయువులనిచ్చి - దయనుజూపి
సంపత్కుమారునకునీవు - సకలవిధుల
దీవెనలనిచ్చి బ్రోతువని - దీనపోష
తలచితిమి మోసమే మాకు - తలచినావా

గీ॥ సృష్టికర్తను యనినీవు - ఇష్టమొలర
పలువిధంబుల జీవుల - బాధపెట్టి
దుఃఖమందున ముంచుచు - తోరముగను
యెంత సంతస మదినీకు - యెరుగజాల

గీ॥ బాధలను కల్పనలుజేసి - బాధపెట్టి
భాధితులు నిన్ను నిందింప - పరగనీవు
పాపమని తీర్పుజెప్పుట - భావ్యమయ్యె
ఏమిన్యాయమో నీకది - యెరుగకుంటి

గీ॥ ధరణి తల్లిదండ్రులకు మించు - దండ్రివంచు
మంచి ఈవులనియ్యంగ - మించిపోదు
వంచు పలికిన వాక్యంబు - నన్నృతంబ
పుడమి నరజాతికిదియె నీ - బుజ్జగింపొ?

గీ॥ బాధలనుపెట్టి బిలిచి నీ - బానిసగను
సేవచేయించుకొనుచున్న - దేవతనయ
పుత్రశోకాంబుదిని ముంచి - పుచ్చినావు
ఇదియా సేవాఫలంబని - యెంచుకొనెన

గీ॥ తండ్రి నాపేర నేమడిగినా - తప్పకుండా
కోరుకున్నది యంతయు - కొదువలేక
ఇయ్యబడునన్న వాక్యంబు - ఇచ్చకంబా
మనుజులను మాయజేయ నీ - మార్గమిదియా?

గీ॥ యెన్నిసారులు నీయెదుట - ఎలమిమీర
మోకరించియు వివిధంపు - మొఱలుబెట్టి
బిడ్డలను కాయుమంటిని - దొడ్డతండ్రి
చేపకును, ప్రతిగా పామునే - చేర్చినావ

గీ॥ బిడ్డలెనమండుగరు కలుగ - ప్రీతినొంది
దేవుడొసగిన స్వాస్థ్యమని - తెలిసికొనియు
కంటికిని రెప్పరీతిని - కాచుకొనుచు
బ్రతుకుచుంటి నెవరికి - భారమిడక

గీ॥ చూచినపుడెల్ల సంతాన - సుకృతంబు
వూసులాడిరి కాసుకు - గాని నరులు
భారమొందిరి కుటిల స్వ - భావులకటా
తుదకు నీకును భారమై - తూగినామా

గీ॥ మరువ వలెనంచు బుధులు నన్ - మందలించ
మరుపు చేయంగ కొమరుని - మరువగలనే
మనసులోపల తనరూప - మమరిపోయె
సతము మదిలోన మెలగునా - సంపదసుతుడు

గీ॥ దైవచిత్తము ఈరీతి - దాపరించె
అతని కానందమందులో - నయ్యెగాని
నాదు హృదయంబు దుఃఖాన - నలిగిపోయె
శక్తిలేనట్టి నేనేమి - చేయగలను

గీ॥ ఎన్నిమాటలు పలికిన - నేమిఫలము
చేయనున్నది తప్పక - చేతువీవు
కారణంబవును మాకది - కష్టదశగా
దాని తలతుము విధి వి - లాసమనుచు

గీ॥ వాదులాడితినని నాతో - బేధపడకు
కోపముంచకు నాపైని - తాపపడకు
కష్టమంతయు నీతోడ - స్పష్టపరచి
మన్ననలు కోరుచున్నాను - మరియతనయా

(28-10-1950)

## 3. క్రైస్తవ కవిపితామహునికి అభినందన

సీ॥ వంగమాత సుభాష - వదలి నీపితృలీ
ఆంధ్రవాణిని జేరి - యలరి నారు
తరచి చూచితివహో - ధన్యాంధ్రభాషను
అమరకోశము లెస్స - నెమరు వేసి
కవితా కుమారినిన్ - గనుసన్నలను జేర
జీర ప్రియుడవై - చెలగినావు
కరుణపొందుచు యశః - కాంతప్రేమను నీవు
నేటికి లీనమై - నిలచినావు

గీ॥ సాధు సజ్జన వంద్యయో - చౌధరి ఘన
వంశనామంబు నీయందె - వన్నె దేరె!
ధాత్రి నీకీర్తి యాచంద్ర - తారకంబె!
మాన్యగుణసాంద్ర పురుషోత్తమ - కవీంద్ర

గీ॥ విధి వంశంబున రక్షణ - విధిని నేర్చి
క్రీస్తు మతసూత్రములనీతి - రీతినేర్చి
కటకపురి స్నానదీక్షను - గైకొని ఇట
తెలుగుదేశాన శుభవార్త - తెలియజేయ

సీ॥ క్రైస్తవుడితడని కర్కశ - హృదయులై
బంధు బృందంబులు - పరిభవింప
స్వగృహవాసంబు సరి - గాదని నుడివి
భ్రాతృండు కినుకను - పంతగింప
దాయాదులెల్లరు - తన్నడ్డుపరుప నీ
యర్ధాంగి నిను జేర - నాలసింప
స్నేహితబృందము - బాహాటముగ ననా
ధరభావమును జూపి - పరిహసింప

గీ॥ దైన్యతను నీవుపొందక - ధైర్యమతిని
జాటితివి గాదె శుభవార్త - జయము పొంది
ఉత్కలాంధ్ర దేశంబుల - నొక్క గురిని
చౌధరివంశ సాగర - చంద్రమగుచు

సీ॥ శ్రీ యేసునాధ సం - సేవి తానందయో
పురుషోత్తమా మోద - గరిమ ప్రణుతి
ఆదిక్రైస్తవమత వ్యాపకా - దీపికా
పురుషోత్తమా మోద - గరిమ ప్రణుతి
పరిశుద్ధ క్రైస్తవ - భవ్యబోద్ధా కవి
వరపురుషోత్తమా - గరిమ ప్రణుతి

గీ॥ పరమభక్తి సౌరభ భాగ్య - ప్రణుతి నీకు
భక్తవత్సల సేవితా - ప్రణుతి నీకు
మాన్య కవిరాజ గణ్యయో - పుణ్యకీర్తి
ధన్యవాదము లివి మహి - తా మహుండ

జగన్నాయకపురం 1932
వేదాంత విద్యార్థిగానున్నపుడు

## 4. కన్య మరియ

సీ॥ మరియమ్మ నీయొక్క - మర్మంబులెరుగుట
సాధ్యబుగాదెవరి క - సాధ్యమమ్మ
కన్నవారలు నీ కు - న్నారని తెలుప
పరిశుద్ధ గ్రంధంబు - పలుకలేదు
కలుషంబులేనట్టి - కన్యకవు నీవమ్మ
నజరేతుపురమున - కరిగితెటుల
యేసేపు గృహమున - కెటుల జేరితివమ్మ
మర్మంబులై మాకు - మరుగుపడియె

గీ॥ కన్యమరియమ్మ నిను భువిని - కనినవారి
చరితమించుక లోకంబు - చెప్పలేదు
దైవ్యపుత్రుని గర్భాన - దాల్చినట్టి
దేవకన్యవు నీవని - తెలుపవేల

గీ॥ నమ్మజాలము నీవు - నరునిపుత్రిక
వనుచు పలుకుట మాకది - వల్లపడదు
పాపిరక్షకుడైనట్టి - ప్రభునినీవు
భువిని ప్రసవింపవచ్చిన - పూజ్యురాల

గీ॥ ప్రభుడు కైసరౌగుస్తు - పాలనందు
ప్రజాసంఖ్యవ్రాయుటకు - ప్రకటనయ్యె
నీదు తలిదండ్రులాసంఖ్య - నెచటలేరు
పుట్టితివి నీవుయెటులమ్మ - పుడమిపైన ?

గీ॥ వెదకితిమి నీదు చరితంబు - వేదములలో
కన్యమరియమ్మ నిను భువిని - కన్నవారు
లెవరో ఎరుగదు బైబిలు - అవనిలోన
పుట్టినావెటుల నీవమ్మ - పుడమిపైన

గీ॥ కానకుంటిరి జనులేల - కన్యమరియ
తలిదండ్రులేనట్టి - తనయ వనియొ
బీదబిడ్డవు నీవన్న - బేధముననొ
నరులు నిర్లక్ష్మైతిరో - నిన్నుజూడ

సీ॥ కలుశంబులేనట్టి - కన్యవు నీవమ్మ
నజరేతుపురవాసి - వైతి వెటుల
దైవసందేశములు ధరణిపై - భక్తులకు
తెలిపెడి గాబ్రియేల్ నిన్నెటుల - తెలుసుకొనెను
దైవపుత్రుని నీవు - గర్భాన దాల్తువను
పరిశుద్ధవార్తను - పలుకుటేల
కన్యను నేనని కలవర - పడుచుండ
ధైర్యంబు దెలెపెగా - దేవదూత

గీ॥ దైవమర్మంబు నీలోన - దాగె గాదె
దైవపుత్రుని గర్భాన - దాల్చినావు
నీవులేకున్న క్రీస్తేసు - నెటుల వచ్చు
భువిని ప్రసవింప వచ్చిన - పూజ్యురాల

సీ॥ లైంగిక బంధంబు - లేనప్పు డలనాడు
యేసేపు గృహమందు - వెలసినావు
కలుషంబులేనట్టి - కన్యవు నీవమ్మ
నామక భర్తకు - నచ్చినావు
దైవమర్మంబును - దేవదూతప్పుడు
కలలోన యేసేపు - కాజ్ఞ యిచ్చె
దూతమాటకు యేసేపు - దూరముగానుండి
సేవజేసె నీకు - జీవితములో

గీ॥ నిన్ను విడనాడ యేసేపు - నిశ్చయించ
కలలోని దూత యేసేపు - కలసిచెప్పె
దైవపుత్రుని మరియ - గర్భాన దాల్చెనని
అతనిలోనున్న అనుమానమం - తమయ్యె

గీ॥ పుట్టబోయిన బిడ్డకు - పూజ్యముగను
యేసు యనుపేరు - యేసేపు పెట్టెగాదె
దైవదూతయే నామంబు - దెలిపెనటుల
దైవచిత్తంబు యీరీతి - ధరణిజరిగె

సీ॥ నామకా భర్తగ - నిలిచిన యేసేపు
దావీదు గోత్రుండు - ధరణియందు
దావీదు వంశాన - తనపేరు వ్రాయించ
పయనమయ్యె రాజాజ్ఞ - భక్తితోడ
నిండుచూలాలివగు - నినుగూడ తనతోడ
బెత్లహేముపురికి - పయనమయ్యె
పశువులశాలలో ప్రసవించి - యారాత్రి
పశులతొట్టెలొ నిడితివి - ప్రధమ పట్టె నకట

గీ॥ రక్షకుడు పుట్టెనను పాట - రమ్యమయ్యె
దూతమూకలు వెలుగులో - తేజరిల్ల
గొల్లలాపాటలను విని - యుల్లసించి
పయనమయ్యిరి బెత్లెహేము - పురమునకు

సీ॥ మూడు పదకొండు యేడులు - ముచ్చటగను
నిలిచినావమ్మ యేసేపు - నిలయమందు
నీవు కనినట్టి యేసుండు - నిరతమకట
నీకుతోడై ఎల్లప్పుడు - నిలిచినాడు
అన్నదమ్ములు తనను - మన్నించకున్న
వెసన పడలేదు ఇంచుక - విసుగులేక
పరిహసించిన పురజనుల - పరిహాసములకు
లేశమైనను చింతిచ - వేదతండు

గీ॥ సత్యమార్గంబు జనులకు - చాటుచుండ
యూదమత గురువులతనిపై - క్రోధమొంది
కసితో జంపిరి శిలువపై - ఘోరము గను
మరియమూర్ఛిల్లె కొమరుని - మరణమునకు

గీ॥ మూడుదినములు సమాధిలో - మూతబడియు
మరణమును గెల్చి లేచె నా - మరియ సుతుడు
నలువది దినములాతండు - నవనియందు
తెలిసికొనజేసె శిష్యులకు - దైవమనుచు

గీ॥ బేతనియవరకు శిష్యులతో - పయనమయ్యి
ఆరోహణంబయ్యె ప్రభు - వచటనుండె
మదిని ఆనందమొందుచు - మేడగదికి
చేరుకొనిరందరు - సాధరముగ

సీ॥ వారలందరితో నీవు - వరసలో పయనించి
స్త్రీలతో మేడగది - చేరినావు
ఎడతెగక వారంత - ఏకముగ ప్రార్ధనలు
చేయుచుండిరి పరిశుద్ధ - శక్తికొరకు
ఆయన సోదరులచ్చట - చేరిరి
పరిశుద్ధాత్మను - పొందగోరి
అగ్నినాలుకలట్లు - ఆత్మ అందరిపైరాగ
మరుగైపోతివి - మరియమాత

గీ॥ దైవచిత్తంబు నెరవేర్చ - ధరణిపైన
కలిగెకష్టాలు నీకెన్నొ - కన్యమరియ
అటనుండి ఆత్మతో పరము - కరిగినావో
ఎరుకలేదేల నరులలో - ఎవరికైన

గీ॥ దైవకన్యవు గాకుండ - ధరణిపైన
ఇన్నికష్టాల కెవరైన - ఇమడగలర
దైవచిత్తంబు నెరవేర్చ - తగునునీకు
దైవసన్నిధి కేగితివి - ధరణివిడచి

గీ॥ దైవకన్యవుగాకున్న - దేవుడెటుల
గాబ్రియేలుతొ నీకడకు - కబురుపంపె
దైవకన్యవుగాకున్న - దేశమందు
కన్నవారలు నీకెటుల - కలగరయ్యె

గీ|| దేవలోకంబు విడనాడి - ధరణిజేరి
దైవచిత్తంబు నెరవేర్చు - తనయునిచ్చి
తిరిగి దేవలోకమునకు - జేరుకొనగా
మాయమైతివ భువినుండి - మరియమాత

గీ|| పొత్తిగుడ్డలచుట్టిన - కత్తి నచట
పాపమంతయు చెండాడి - పారదోల
పాపులందర్ని రక్షింప - భువిని నెపుడు
దాచినావమ్మ మరియమ్మ - దాపరముగ

గీ|| పశులశాలలో - ప్రభుయేసు పుట్టగానె
పువ్వు వికసించినపుడ - పరిమళంబు
పలుదిశలకు - ప్రాకి నటుల
సంతసించిరి మనసులో - ననంతముగను

## 5. ఊహాగానము శిశువైన యేసు

(ఒకశివువు పొత్తిగుడ్డలతో చుట్టబడి యొక తొట్టిలో పండుకొనియుండుట మీరు చూచెదరు లూక : 2 : 12)

గీ|| అది మహాపురమని - అనగ తగదు
పల్లియనిగూడ దాని - పలుక తగదు
నగరమనిగూడ దాని - ననగతగదు
బెత్లెహేమను దానికి - పేరుగలదు

గీ॥ బైబిలను గ్రంధమందు - భవ్యముగను
పలుకుచున్నారా పేరు - ప్రోక్తలంత
దైవదూతలు దాని - దరిని జేరి
మధురగానంబు జేసిరి - నిదురవేళ

గీ॥ పుట్టితేదొకదు చెత్లెహేము - పురముననగ
గొల్లలది విని భీతిల్లి - తల్లడిల్లి
వెదకిరారాత్రి బెత్లెహేము - వీధులందు
కడకు గోవులశాలలో - గాంచిరతని

గీ॥ స్వర్గమందున నీపేరు - స్థిరముజేసి
గాబ్రియేలను దూత - ఘనముగాను
నామకరణంబు జేయదే - నరునిరూప
దైవరూపంబు నీలోన - దాచియుంచి

గీ॥ తల్లిదండ్రులనెరుగని - తనయ మరియ
గర్భమందున వాక్యమే - యుర్వియందు
నరునిరూపాన జన్మించి - నరుడవైతి
పుడమిపాపులరక్షింప - పూజ్యనీయ

గీ॥ పశులశాలలో నీవేల - పుట్టినావా!
అచట యేసేపు గృహమున - అతిధిగాను
పెరుగుచున్నావు నీకేల - పేదబ్రతుకు
కారణంబేమొ నాకది - కానరాదు

గీ॥ తొట్టిలో నిన్ను గడ్డిపయి - బట్టపరచి
పండుకొని జేసినదితల్లి - అండలేక
కందిపోదయ్య నీమేను - సుందరాంగ
తలచి నామదిని కన్నీటి - ధారలొలికె

గీ॥ ముద్దులొలికిన నీమోము - ముద్దులాడి
కౌగిలిని జేర్చుకొని నిన్ను - కరువుదీర
జోలపాటలుపాడి - లాలింతు ననెడి
మమత కలుగుచునున్నది - మనసునిండ

గీ॥ చిన్నిచేతులు కాళ్ళతో - చిందులాడు
బోసినోరుతో గట్టిగా - ఊసులాడు
కేరుకొట్టిన నినుజూడ - కానరెవరు
వంటిగాడివి యైతివా - చంటిబాబు

గీ॥ ఊసులాడేటి నీముద్దు - భాషలోన
తెలుసుకున్నాను నీపేరు - తేటముగను,
క్రీస్తుగాదయ్య నీపేరు - కలుషహరణా
మరియ కాదయ్య నీతల్లి - ముద్దుబాల

గీ॥ బోసినోరైన నీతోటి - ఊసులాడ
బాలబాలికలు లేరయ్య - పలుకరింప
పసుల పాకలో పుట్టిన - బాలుడంచు
చిన్నచూపులు వారిలో - చేరుకొనెనా !

గీ॥ రాజవంశాన పుట్టిన - రాజువీవు
దేవలోకంబు సేవించు - దైవ మీవు
నిన్ను యెరుగదు లోకంబు - నిజము నిజము
పుడమి జేరితి వెందుకో - పూజ్యనీయ

గీ॥ స్నానమాడింప నాయొద్ద - సబ్బులేదు
పరిమళము రాతునన్న - పన్నీరులేదు
లాలిపాడుదునన్న - ఉయ్యాలలేదు
ధరణిజనులకు నీయందు - దయయులేదు

గీ॥ అందమైనట్టి నీరూప - మెందుగలదు
పాలబుగ్గల ముద్దాడ - పట్టుకొనగ
చిన్నచేతులు చెంపల - చేరగానే
మాయమయిపోవు కలుషంబు - మదినివీడి

గీ॥ యెత్తుకొంటిని ముద్దాడ - హస్తములతో
కౌగిటిని హత్తుకొంటిని - కరువుదీర
చిన్ని చేతులు మోమున - సోకగానే
దేహములోనున్న రోగాలు - తొలగిపోయె

గీ॥ తల్లియని ప్రజలు, మరియను - తలచి, తలచి
పూజలను జేయుచున్నారు - పుడమియందు
శిల్పమును జెక్కి గుడిలోనే - చేర్చితనను
దూపదీపాల పూజలో - తేజరిల్ల

గీ॥ నీవులేకున్నయేదియు - నిలువలేదు
కలిగినది నీవులేకున్న - కలుగలేదు
నీవుగాదయ్య సృష్టి - నిర్మితుడవు
మరియ వక్షంబె పోషింప - మాయగాదె

గీ॥ హృదయమందున జ్యోతొకటి - వుదయమయ్యె
మదిని గాడాంధకారంబు - మాయమయ్యె
యెరుగ నీ బాలకునిశక్తి - ఏరితరము
పాపహరుడని వీనినే - పూజసేతు

గీ॥ జ్ఞానులిచ్చిరి బంగారు - గజ్జియలకు
సాంబ్రాణి బోళములు - సరసమతిని
ముట్టవైతివి వాటిని - ఇష్టపడక
సృష్టికర్తవు అవినీదు - సృష్టిగనుక

గీ॥ దేనితో నిన్నువర్ణింతు - దేవతనయా
చంద్రబింబవదన మని - చెప్పగలనా
పద్మరేకులు కనులని - పలుకగలనా
విశ్వరూపంబు నీలోన - వెలసియుండ

గీ॥ స్వార్ధమే యూదజనులకు - స్వంతధనము
రాజుహేరోదు నినుజంప - రోజురోజు
కుటిలమనసుతో నీయందు - కఠినుడయ్యె
యూదజాతిలో బుట్టితివి - బాధకొరకా

గీ|| పొత్తిగుడ్డలనినుజుట్టి - పొందుగాను
పొలుకుడుచు చున్నట్టి - బాలయేసు
వక్షమునజేర్చిముద్దాడు - వనితమరియ
వక్షమున నిమిడిపోతి నీ - లక్షమేమొ

## 6. యేసు జన్మము

1. తూర్పుజ్ఞానులు గగనాన - తారగాంచి
గొప్పవాడొకడు పుట్టెనన్న - గణితమెరిగి
పయనమయ్యిరి వారలా - ప్రభుని జూడ
తారముందుండె వారికి - దారిజూప

2. మార్గమునజూచి హేరోదు - మందిరమును
హేరోదు యూదులకు రాజని - ఎరిగివారు
యూదులకు రాజొకడు - పుట్టినాడు
గగనమందు తారనుగాంచి - కలియవచ్చితిమి

3. శాస్త్రులను పిలిచి అడుగ - శాస్త్రములు చెప్పె
బెత్లహేములోనని - పలికినారు
రాజు జ్ఞానులతో పూజించి - రండి మీరు
నేనుకూడ పూజించెద - ననియె

4. చుక్కవెనుకను - చనియె జ్ఞానులు
బెత్లహేమున జేరుచు - పైకి జూడ
గగనమందున నిలిచె నా చుక్క - కదలకుండ
గృహమందున జేరిరి - గౌరవముగ

5. బాలయేసును చూచిరి - తల్లికడను
సాష్టాంగపడిరి యేసునకు - సాదరముగ
బంగారుసాంబ్రాణి భోళములను - భక్తితోడ
అర్పించినారపుడు బాలుని - కర్పణముగ

6. దూత కలలోనచెప్పిన - రీతిగాను
మరుదినంబునే జ్ఞానులు - మరలినారు
వేరెమార్గము నందున - వేదమతులు
తరలి నారయ్యా తమతమ - స్థానములకు

7. కుపితుడై హేరోదు జ్ఞానులపై - క్రోధమొంది
బెత్లహేము పరిసరప్రాంత - జాలులో
రెండుఏండ్ల బాలురను - ఖండించ మనియె
అకట బడ్డలకై రాహేలు - అంగలార్చె!

8. కలలోన యేసేపునకు దూత - కబురు దెలుప
వేగముగ సిద్ధపడి - వాహనమును
నందు మరియమ్మ, యేసు - నందుంచి
చేరుకొనిరయ్యా ఈజిప్టు - చేరువకును.

## 7. క్రీస్తుని గూర్చిన ఆలోచన

ద్విII ఉత్తి ఉత్తిన రాలేదు - పెత్తనమునకు
విల్లుభాణాలు ధరియించి - కొల్లగొట్ట

మల్లయుద్ధంబు చేయ నా - వల్లకాదు
నీతిమాలిన పనులకు - నిలువలేను

అతివలనుజేరి హాస్యంబు -లాడలేను
ఉల్లమందునపాపంబు - చెల్లునటుల

రక్తధారలు ప్రసరించి - ముక్తిగొలుప
వచ్చితినిగాని నన్నెవరు - మెచ్చరైరి

పాపి రక్షించుబడువరకు - పైనమయ్యి
చేరుకొందును గొల్గొత - చేరువకును

పృధ్విలోలేదు నాకయె - కొద్దిస్థలము
సిలువపైనుందు మరియొక - స్థలములేదు

నేను కోరినదొక్కటే - నీచమైన
పాపిహృదయాన నేజేరి - పవ్వళింప

అదియె నే కోరుకున్నట్టి - ఆశ్రయంబు
గాని వారలు నన్నేల - చేరనీరు

పాపమె మధురమగు - పానమంచు
చేరనియ్యరు హృదయంబు - చేరువకును

తలుపు తట్టుచునున్నాను - కలుసుకొనగ
తియ్యరేమయ్యా నామాట - తీపిలేదా ?

## 8. క్రీస్తు శ్రమలారంభము

గీ॥ మేడగదిలోనికందరు - కూడుకొనిరి
పస్కవిందును ఘనముగ - ప్రభువు నడిపె
ప్రార్ధనలు జేయనందరు - పయనమైరి
నిశ్చలమైనస్థలమది - గెత్సెమునకు

గీ॥ ప్రజలు గుమిగూడివచ్చిరి - ప్రభునికొరకు
కదముద్రొక్కెను పేతురు - కుపితుడగుచు
జులిపినాడయ్య ఖడ్గము - తళుకుమనియె
మల్కు చెవి రాలిపోయింది - మరుక్షణమున

గీ॥ ప్రభుడా చెవి - చేతపట్టుకొనియు
పేతురూ కత్తి వరలో - పెట్టుమనుచు
మల్కుజెవి యతనికి - మలరిచి నంత
భంగపడిరయ్య - శిష్యులు ప్రభునిచూచి

సీ॥ శిష్యులచటినుండి - చెదిరిపోయిరహ
ఎండుటాకులుగాలి - కెగిరినటుల
నిర్భయంబు గలిగి నిలిచెను - యోహాను
దిగ్భ్రమచెందుచు - దిగులుతోడ
ఏసునివారలు - దోషియని పలుకుచు
క్రూరులై కొట్టుచు - కులుకుచుండ
పిరికిమనసు నున్న పేతురు - వెంటాడ
రమ్మనె యోహాను - సమ్మతముతో

గీ॥ పేతురతనిని వెంటాడి - పిరికివాడై
చలికి వేరొక చోట - నిలిచిపోయె
అనృతంబాడె యేసుని - ఎరుగననుచు
భ్రష్టబుద్ధికి బలియయ్యె - భ్రష్టుడయ్యె

సీ॥ ఏమి జరుగునో చూడ వెంబ - డించిన యతడు
చలికాచుకొనగోరి - చేరెనచట
గలలియుడితడని కను - గొన్న కొందరు
వీడు క్రీస్తుతోటి - వాడనంగ
కాను, కానని చెప్పి కల - వర పడుచుండ
చిన్నది వీడేయని - చెప్పినపుడు
పేతురు భయపడి భీతి - తో తనతోడ
మొండిగా కాననెను - మొండికెత్తి

గీ॥ ఎరుగనని బొంకె ముమ్మారు - తిరుగులేక
కోడికూసెను, ముమ్మారు - కాలమదియె
ఏడ్చె పేతురుడు గతమును - ఎదనుదలచి
తెల్లవారెను యప్పుడే - తేజముగను

సీ॥ సంతాపపడి యేడ్చి చింత - తో క్రుంగుచు
విలపించి విలపించె - తలచి తనలో
పేతురో నీవు పెట్రాసు - వగుదువను
మరచిపోయిన ప్రభుమాట - మదికిరాగ
భయబీతులన్నియు పయనమై - తనను౦డి
పిరికితనము వెంట - పారిపోయె
మీరు చంపిన యేసు లేచెనని - మేము సాక్షులమంచు
ఎదురాడె యూదులతో - ఎదురుపలికి

గీ॥ ధైర్యతత్వంబు పేతురులో - తేజమయ్యె
చాటుచును తిరిగె వీధులలో మేటియగుచు
ఏమిచేతుము మనమని - యూదులపుడు
చేరుకొనిరొకమూల వారలు - చింతపడుచు

గీ॥ పతనమయ్యెను తనలోనె - పిరికితనము
ధైర్యతత్వంభు తనలోన - తేజరిల్లె
ఎదురుతిరిగెను యూదులకు - బెదరులేక
కదలె విశ్వాసమతనిలో - కార్యమగుచు

గీ॥ కాంతిపోయెను వారిలో - శాంతిలేక
మదినితత్తరపాటులు - మలచుకొనగా
చంపనాలోచనలు తోడ - సకలవిధుల
చేతగాకుండె వారిలో - భీతికలిగి

## 9. శిలువ వర్ణన

సీ॥ ఉదయాద్రిపై ఇనుడు - నిదురలేచిన యతడు
పయనంబుకై సిద్ధ - పడుచునుండ
తూర్పుదిక్కంతయు - తొగరురంగును దాల్చి
ఆకాశమంతయు - ఆవరింప
కోకిలపాటల - కోలాహలంబైన
పక్షిరవంబులు - పల్లవింప
తెల్లవారెనంచు యెల్ల - జనులు లేచి
దినకృత్యములుచేయ - దీక్షనుండ

గీ|| కాలమందున పురములో - కలతగలిగె
న్యాయస్థానంబునందు - నన్యాయమమరె
మరియతనయుని శిక్షింప - ముద్రపడియె
సంతసించిరి యూదులు - యెంతగానో

గీ|| అల్లదె సిలువపైని - నల్లాడుచున్న
మేలుబంగారు రూపమున - మెరయునట్టి
క్రీస్తుదేహంబు దెబ్బల - క్రందిపోయి
చూడరూపంబు లేనట్లు - చిదిగిపోయె

గీ|| అకటా శిరముపై కంటక - మకుటమునను
పాపమగు నాదు తలపుల - భారమునను
సుందరంబైన నీమోము - ముందుకొరిగె
రుధిర ధారలు చిమ్మెనే - పృధివినెల్ల

సీ|| దండధరులు నిన్ను - దండించుటేలకో
తప్పుమాటలు నీవు - చెప్పలేదు
యూదులు నినుబట్టి - బాధించుటేలకో
కీడుచేసితివన్న - జాడలేదు
అపహాసకులు నిన్ను - నపహసించుటేలకో
కానిక్రియలు నీలో - కానరావు
ముప్పదిరూకల - కప్పగించిన శిష్యుడు
ఇస్కరియోతుకై - విసుకవేలో

గీ॥ దోషమించుక నీలోన - దొరకలేదె
కారణంబులు వెదుకగ - కానరావె
ఈర్ష్యగలిగెను ఏలకో - వీరియందు
దైవపగు నీకు శ్రమలేల - తారసిల్లె

సీ॥ ఆశీరవంబుల - కాటపట్టైన నీ
అరచేతులకు మేకుల - దుమబడెనే
ప్రేమధారలు నెపుడు - ప్రవహించుచున్న నీ
హృదయాన బల్లెంపు - పదునుదూరె
సకలవ్యాధులు బాప - నిఖిలస్థలముల దిరుగు
పాదంబులకు మేకు - లదిమినారె
మృదుభాషలొలికిన - అధరంబులకునయో
చేదుచిరకా రుచి - చేర్చినారె

గీ॥ దిక్కులేనట్లు శిలువపై - దీనముగను
కౄరమైనట్టి యాశ్రమల - నోర్వలేక
ప్రజల పాపంబు బాప బలి - పశువుగాను
మరణమైతివా శ్రీయేసా - మరియు తనయ

సీ॥ యూదజనులుగూడి - బాధించుబుద్ధితో
పరుషవాక్యంబులు - పలికినపుడు
కేళింతలాడుచు - జాలించుకై లేక
అరచేతులతో నిన్ను - చరిచినపుడు
కండ్లగంతలుగట్టి - పండ్లు పటపటగొరికి
బుద్ధి లేకుండ వీపుపై - గుద్దినపుడు
క్రోధంబుతో భటులు - బాధింప తలపెట్టి
కొరడాలతో నిన్ను - కొట్టినపుడు

గీ॥ తల్లి మరియమ్మ నినుజూచి - తల్లడిల్లి
నేలపై తాను నిలువునా - కూలినపుడు
పారిపోయిరి శిష్యులు - పరుగులెత్తి
ఒక్కడవె నిలిచిపోతివా - దిక్కులేక

సీ॥ జన్మించితివిగదా - జన్మ పాపముదీయ
నరరూప ధారివై - కరుణతోడ
కర్మపాపంబనెడి - కలుషంబు బాపంగ
శ్రమనొంది నావయ్య - విమల మతిని
నే పొందగల శిక్ష - నీ వొందుటకుగదా
న్యాయ స్థానంబున - నిలిచినావు
మన్నించి ననుబట్టి - మోక్షంబు చేర్చంగ
శిలువపై మరణంబు - చెందినావు

గీ॥ నీవు పొందిన శిక్షలకు - నిరుపమాన
ప్రేమ నీలోన పుట్టె నా - క్షేమమునకు
కారణంబయ్యె గాదకో - కలుషహరణ
మొక్కెదను నిన్ను మనసారా - మోక్షదామా

గీ॥ అతడు శిలువపై లోకాన - అంతరించి
మృత్యులోకాన మూనాళ్ళు - ముచ్చటించి
తండ్రి కుడి పార్శ్వమున - చేరి తండ్రితోడ
పూర్తియైనది తమపని - భువినియనుచు

## 10. పునరుత్థానము

సీ॥ తూర్పుదిక్కప్పుడే - తొగరురంగును దాల్చి
తపనుని రాకకై - దారిగొలుప
పిల్లగాలుల తెరలు - చల్లగా వీచంగ
పక్షుల గానముల్ - పల్లవింప
ముకులిత పుష్పములు - వికసించు చుండంగ
పరిమళములు దిసల - ప్రాకుచుండ
యూదయపర్వత - ఉన్నతశిఖరాల
బాలభానుని కిరణములు - పైకిసోకు

గీ॥ కాలమందున సమాధి - కడకు జేరె
మగ్దలను మరియ దు:ఖంపు - మనసుతోడ
వత్తి సమాధిని జూచి - చిత్తమందు
తస్కరించిరి ప్రభునిదేహమని - తలచెనామె

సీ॥ ప్రభునిదేహంబు నెవరో - పట్టుకొని పోయిరని
రోదించు మరియమ్మ - బాధనెరిగి
అమ్మా! యనిపిలిచె - నెమ్మదిగా ప్రభువు
తోటమాలిగా ప్రభుని - తలచి యామె
యేసుదేహము నీవు - నెచట నుంచినావొ
ఎత్తుకొనిపోదు నిమ్మని - యేడ్చుచుండ
మరియా! యేసు - మరల పిలవగానె
స్వరము నెరిగి రబ్బూని యని - మరియ పిలిచె

గీ॥ తండ్రికడకునేను - తరలిపోవలె
ముట్టవద్దని తనతో - నిట్టులనియె
గలలియలోనన్ను - కలుసుకొనుడ
ను, వార్తనంప శిష్యులు - నమ్మలేదు

గీ॥ యూదులకు భయపడి - బాధింతురనుకొని
పదిమంది శిష్యులొక్క - గదిలోజేరి
తలుపులను భంధించి - తలచుచుండిరి
ప్రభువువారిమధ్య - ప్రత్యక్షమయ్యె

సీ॥ ఆనందపరవశులై - ఆయన మాటలాలించి
ధైర్యముతోవారు - దర్శించు మాట
తోమాతో తెలిపిన - ఆమాటలాలించి
నమ్మనని అపనమ్మకముతో - అరచేతి
గాయములో అతనివేలునుంచి
ప్రక్కలో గాయమందు - చక్కగా తనచేయ
వుంచినప్పుడే నమ్మక - ముంచునది
పలుకుచుండంగ - యేసుప్రభు

గీ॥ ప్రత్యక్షమై - ప్రభుడు తోమాతో
గాయములుచూడ - ఖాయపరిచే
నాప్రభూ, నాప్రభూ - ననుకరుణించుమని
నయము మీర - ననుచు తోమా

గీ॥ నమ్మి యా తోమ - నమ్మకముగ
భరతమాతను - ప్రభునిజేర్చ
భరతదేశంబు చేరెను - భవ్యముగను
మలబారుతీర - మదినిజేరి

## 11. ఊహ

సీ॥ పొదరిండ్లలో నేను - నిదురపోయిననాడు
మదిలోన నిన్ననే - మరువలేదు
ఎదురైన బీదల - పదిలంబుగా జూచి
ఆదరించితి నేను - బాధపడక
భక్తవరులతోడ - పరిచయంబేగాని
ఎదురుమాటాడ నే - నెరుగనెప్పుడు
తోటిమానవునితో - మాటాడినప్పుడు
భాతృభావంబుతో - పరిచయించు

గీ॥ ఇట్టినన్నేల కట్టాల - పెట్టుచుందు
భ్రష్ట బ్రతుకుతో నన్నేల - పరిభవింతు
నేరమా నేనుజేసేది - ధారుణంబా
నీవు దయజూపవేలకో - నిరుపమాన

# 12. వేదన

సీ॥ చిత్తంబు నినుజూడ - చిందులాడెనుగాని
మనసున కదియేమొ - మరుగుపడియె
దేహంబు నీనుజూడ - దేవురించెను గాని
ఆత్మలో చెడుగేలో - అడ్డుపడియె
నిరతంబు నినుజూడ నెనరు - వేసితిగాని
మస్తిష్కమునకది - మాయమయ్యె
హృదయంబు నినుజూడ విధము - కోరెనుగాని
మదిలోని వెలుగంత - మాయమయ్యె

గీ॥ అకట! నిన్నెటుల గనుగొందు అవనియందు
పాడులోకంబు నాకొక - పగ్గమయ్యె
లాగుచున్నది వెనుకకు - సాగదీసి
జీవితాచింత ఎల్లపుడు - దిగులుపరచి

సీ॥ జీవచ్ఛవంబునై - జీవించుచున్నాను
తనువున నిన్నెపుడు - తలచకుండ
కనులతో నినుజూడ - కోరుకొంటినిగాని
కోరికలు నన్నెపుడు - కూలదోసె
జిహ్వతో నిన్నెపుడు - చెప్పగోరితిగాని
పలువిధ రుచులకు - బానిసయ్యె
వీనులతో నినుగూర్చి - వినగోరితినిగాని
పరుషవాక్కుల విన - పూజ్యమయ్యె

గీ॥ అకట! నినుజూడ నిన్నెపుడు - ననుసరింతు
మాయమనసంత నినుజేర - మరపుచేయ
కాలజీవితమంతయు - కలుషమయ్యె
ఎపుడు నినుజూడ గలనయ్య - యేసుదేవ ?

గీ॥ కదముదొక్కెను మనసంతా - కఠోరముగను
దేహవాంఛల కధికముగ - దాహపడియె
జీవితంబంత పాపపు - చీకటయ్యె
ఎటుల చేరుదు నినుజూడ - యేసుదేవ

## 13. ఆలోచన

సీ॥ పరమపురవాసుని - పాదాలపైబడి
విడనాడకుండనే - వేడుకొంటి
పలువిధంబులైన - విలువ కానుకలిచ్చి
మ్రొక్కుకొంటినినిన్ను - మోదమతిని
పాపజీవితమంత - బాపి ననురక్షింప
యెదను పూజించి - విధముతెలిసి
పుణ్యమూర్తివి నిన్ను - పూజించి తెల్లపుడు
పట్టువిడవకుండ - పగలురాత్రి

గీ॥ ఇన్ని చేసిన నాబ్రతుకు - ఇంతియేనా
ఎన్నిచేసిన దయనీకు - యేలలేదో
లోపమేమున్నదో నాలో - జూపవయ్య
రాతిబొమ్మవు కావు - నజరేతువాస

సీ॥ సొగసైన నీరూపు - వికసించె నాలోన
భక్తిజీవితంబు - ప్రబలమయ్యె
అధరంబుపై నీదు - కుదురైన చిరునవ్వు
ప్రేమ నీపై నాలో - పెంపుజేసె
కరుణగల నీయొక్క - కనుచూపులే నన్ను
స్నేహింప నినుజేరి - సేవజేయ
వీనులకింపైన - వినుపించు నీవాక్కు
సత్యత్రోవలు నాలో - చక్కబరిచె

గీ॥ నిన్ను పోలిన యవతార - మెవరులేరు
కానరావయ్య జగతిని - కలుషహరుడా
జీవితము నీకు యర్పింతు - జీవదాతా
కర్రబొమ్మవు నీవుగావు - క్రీస్తుదేవా!

సీ॥ తొలకరివానలు - చిలకరించినరీతి
పరిశుద్ధాత్మను - పంపవేల
కొండలపెకలించు - దండగు ప్రచండ
విశ్వాసశక్తి మా - కివ్వవేల
దయ్యాల బెదరించి - తరిమెడు బలమును
చేకూర్చి శిష్యునిగ - చేయవేల
రోగులను చేపట్టి - బాగుచేసెడి వరము
ఇంపుగ నాకు కలి - గింపవేల

గీ॥ ప్రార్థనలు చేయనాతో - పలుకవేల
ఇంతగా నీవు శోధింప - వింతగాదె
ఏలకో వూరుకున్నావు - యెరుగనైతి
మట్టిబొమ్మవు గావుగా - మరియతనయా

గీ॥ ఆదియందున వాక్యమై - అమరియుండె
అతడు లేకున్న నేదియు - అగుటలేదు
అద్భుతంబుగ నరుడుగా - నవతరించె
అతడు మరియమ్మ గర్భాన - అవనియందు

గీ॥ అతడు లోకాలకందని - ఆత్మరూపి
పాపిరక్షణకొఱకైన - పరమబాట
సత్యములను తెల్పు గ్రంధాల - సారమతడు
భువిని జన్మించె మరియమ్మ - పుత్రుడగుచు

గీ॥ పాపలోకమును రక్షించు - పావనుండు
దురిత గుణములు పరిమార్చు - దొరయతండు
శరణుగోరిన వారలన్ - చేర్చుకొనుచు
రక్షణానందమునుగొల్పు - రక్షకుండు

గీ॥ వేదవేదాంతసారంబు - వెదకినపుడు
సత్యరూపాన యతడు ప్ర - త్యక్షమగును
భక్తజన హృదయలోకాన - భానుడనగ
తేజకాంతులు విరజిమ్ము - రాజతండు

గీ॥ చింతచీకులతోనెపుడు - చివికియున్న
జీవితంబులు తనకడ - జేరినపుడు
భాధ తొలగించి ప్రేమించి - ఆదరించి
తల్లిదయకన్న మించిన - దయనుజూపు

## 14. సంఘాల దుస్థితి

సీ॥ బైబిలునెపుడైన పట్టని - వాడొకడు
తల్లిదండ్రుల దిట్టెడి - దెష్టయొకడు
ఎన్నడు యారాధ నెరుగని - మరియొకడు
చందాలు ఇవ్వని - చవట యొకడు
పోకిరిమాటల పొగరె - క్కువాడొకడు
రౌడీల గుంపుల -రాయడొకడు
వీధుల తిరిగెడి వెంగల - పింజొకడు
రోతమాటలాడు - పోతుయొకడు

గీ॥ ప్రార్ధనన్నది యెరుగని - భక్తుడొకడు
చూడగలమయ్యా వారలను - చోద్యముగను
సంఘ బిజినెసు మీటింగు - సభలలోన
నిండి పోదురు గుడినిండ - దండిగాను

గీ॥ భక్తి లేషంబు లేదయ్యా - భయముపోయె
ఇచ్చుకానికి పెద్దలు - ఈసడించి
పలుక భయపడగ - న్యాయంబు పతనమయ్యో
సంఘమందలి క్షేమంబు సాగదయ్యో

గీ॥ పైకి వేషంబుగా మారె - భక్తియంత
పెద్దలయెడ గౌరవంబెల్ల - ప్రొద్దుపోయె
తరిచి చూడంగ మర్యాద - కురుచయయ్యె
ప్రస్తుతంబిదియె క్రైస్తవుల - ప్రకృతయ్యె

(16-05-1968)

## 15. సువార్తకుని జీవితము

గీ॥ పల్లెలరదేగి ప్రభుసేవ - భాగ్యమనుచు
మూఢజనులకు సువార్త - ముచ్చటించు
భోధకులు పొందుచుండెడి - బాధలెవరు
తలపకున్నారు కాలంపు - ధర్మమేమో

గీ॥ ఆలుబిడ్డల కడుపార - నన్నమిడక
కైనజాలని జీతంబు లై - న లేక
బాధలొందుచున్నట్టి - బోధకులను
తలపకున్నారు కాలంపు - ధర్మమేమో

గీ॥ విద్యబిడ్డలకొసగెడి - విధము తలచి
పాఠశాలకు ఫీజులు - కట్టలేక
పడుచునున్నటి బోధకుని - బాధలెవరు
తలపకున్నారు కాలంపు - ధర్మమేమో

గీ॥ నోటికొచ్చిన రీతిని - మాటలాడి
దుఃఖపరతురు తామెంతో - యెక్కువనుచు
బోధకుడు పొందునట్టి యా - బాధలన్ని
తలపకున్నారు కాలంపు - ధర్మమేమో

గీ॥ ఊరుకొనకున్న ఉద్యోగ - మూడిపోవు
ఊరుకున్నను పైనెక్కి - వురుముచుందురు
బోధకుడు పొందుచున్నట్టి - ఈ బాధలన్ని
తలపకున్నారు కాలంపు - ధర్మమేమో

గీ॥ దయ్యములరాజు యేసని - తలచలేదా
తిండిబోతతడని - తిట్టలేదా
వాటనన్నింటి మనసులో - వరసదలచి
ఆదరము పొందగోరు మో - బోధకుండా

## 16. ప్రార్ధన

సీ॥ సర్వలోకంబెల్ల - నిర్వికారుడవనియు
పలికినమాటలు - తలచకుండ
నీరూపుచూడంగ - నిరతరంబు మదిలోన
ఆశించి ప్రార్ధించి - అలసిపోతి
దిన చర్యలో ప్రధమ - దినచర్యగా నిన్నే
పూజించితిని గాదె - పూజ్యమతిని
దర్శనంబేలకో - దయచేయవైతివి
కారణంబేమిటో - కానబడదు

గీ॥ కోపమా నాపైని - కూర్మిలేదా
దిక్కులేనటుల నన్నిటుల - హీనపరచి
కించపరచుట నీకిది - లాంఛనంబా
రూపమునుజూప రావేల - పాపహరుడా

సీ॥ పసిడి వన్నెలమించు - పాదపద్మంబులు
కన్నీటిధారలన్ - కడిగి కడిగి
కేశపాశమువిప్పి ఆశతో - తుడిచి
ముద్దాడిముద్దాడి - ముదముమీర
పరిమళంబులు తెచ్చి - పాదంబులకునరది
భక్తితో పూజించు - పడతినపుడు
కాంతా నీ పాపములు కరుణ - తోడను నీవు
పరిహరించితినని - పలికినావు

గీ॥ పాపహరణకై యారీతి - పూజసేయ
భాగ్యహీనుండనై నేను - పలువిధముల
ప్రార్ధనలు చేయుచున్నాడ - పరమతండ్రీ
కానరావేల శ్రీయేస - గగనవాసా

## 17. వంశధార (సెప్టెంబరు 1980)

సీ॥ వంశధారానది ఉప్పొంగి - ప్రవహించె
గ్రామాల నన్నింటిని - కూలద్రోసె
తరతరాలనాటి తాతలు - కట్టిన
గృహములు నీటిలో - కూలిపడియె
ఆరంభ సంఘమగు - ఆకుల తంపర
సభ్యులు వేనట్టి - సంఘమయ్యె
కష్టాల కెదురీది కట్టిన - ఆలయము
కదలదయ్యెను, నది - కదపలేదె

గీ॥ ఆదిసంఘంబునకది - ఆనవాలో
తిరిగి సంఘంబచ్చట - చేరనగునో
యేది కారణంబో - ఎరుగలేము
దైవచిత్తంబదేమిటో - తలపగలమా

సీ॥ క్రీస్తుసేవజేయ కెనడ - మిషనెరీలు
కాకినాడజేరు - కాలమందు
ఆకులతంపరలో - ఆదిసంఘము
ఆకాలమునకు ముం - దచటనుండె
అప్పులనరసింహ - మతని అర్ధాంగియు
మరిముగ్గురితో సంఘ - మమరబడియె
ఆదిసంఘమని - ఆనాటిమిషనరీలు
చూడవచ్చిరిదాని - చోద్యముగను

గీ॥ ప్రభునికృపలవనసంఘము - పెద్దదయ్యె
జాతిగల హిందువులందరు - చేరుకొనిరి
ప్రార్ధనాశక్తివారిలో - ప్రభలమయ్యె
తల్లిసంఘంబుయని - తలచిరపుడు

సీ॥. ఆనాటి క్రైస్తవుల - అయికమత్యంబు
నేటిక్రైస్తవులలో - నీటగలిసె
పెద్దలయందున్న - భక్తిమర్యాదలు
నేటిక్రైస్తవులందు - నీటగలిసె
సంఘంబులందున్న - సత్యశీలమంత
నేటిక్రైస్తవులను - దాటిపోయె
సంఘక్రైస్తవులందున్న - సహవాసగుణములు
నేటిక్రైస్తవులందు - నీరసించె

గీ॥ అకట సైతానుగుణము - ఆచరింపు
పార్టీలు సంఘాల - ప్రభలమయ్యె
మోసగుణములకు - పెద్దలు దాసువైరి
కడకు మహాసభయంత - కూలిపోయె

## 18. అనుభవము

సీ॥ అలనాటి నీప్రేమ - తలపంగ హృదయాన
దైర్యసాహసములు - తాండవించె
ఎదురుఢీకొన్న - బెదరక సాతాను
మాయలన్నింటిని - మట్టుపెట్టి
పాపిని రక్షించు - భాగ్యంబు నీవని
ఉల్లమున నుద్రేక - మల్లుకొనగ
నీ సుచరితంబు - నిరతంబు చాటించు
భాగ్యంబు నాకైన - భాగ్యమనుచు

గీ॥ రాత్రిపగలనక నాలోన - రగులుచున్న
ఆత్మప్రేరేపణంబుల - మార్పుకుండ
సిలువనీడను నిలుచుండి - విలువగల్గు
నీదు వాక్యంబు చాటితిని - నిరతమవని

సీ॥ పరిభవించెడి బుద్ధి - ప్రజలందు కలిగిన
లేషమైనను దాని - లక్ష్యమిడక
కేళింతలాడెడి - కుజనులు ననుజుట్టి
కలవరము నాలోన - కలుగజేయ
వదరుబోతులు గూడి - యెదురాడి వాదింప
వాక్యఖడ్గంబుతో - వోడగొడితి
రాళ్లురప్పలు విసరి - రస్కంధజరిపిన
శాంతభావముతోడ - చక్కబరచి

గీ॥ పిరికితనమును నాలోన - పెంచుకొనక
వెన్నుజూపెడి బుద్ధిని - వెనుకపెట్టి
ముందుటడుగులు వేయుచు - ముద్దుగొలుపు
నీదు వాక్యంబు జాటితిని - బోధకునిగ

## 19. పతనము

తే॥గీ॥ నిజము పల్కితినొకమారు - సుజనరీతి
భజనచేయుచు దేవుని - భక్తితోడ
ఇప్పుడయ్యయ్యో సత్యంబు - చెప్పకుంటి
దైవసన్నిధినుండి నే - దాటిపోతి

తే॥గీ॥ తలపులన్నియు కలుషంపు - తలపులయ్యె
వలపులన్నియు దుర్జన - వలపులయ్యె
కలసిమెలసెడు స్నేహంబు - కలుషమయ్యె
శీలమంతయు ఛిద్రమై - చిదిగిపోయె

తే॥గీ॥ ప్రార్ధనాజీవితంబెల్ల - పారిపోయె
సత్యవాక్యంపు పఠన - సద్దణగిపోయె
బోధలన్నియు రారాను - బేధమయ్యె
ఆత్మతీవ్రత అంతయు - నణగిపోయె

తే॥గీ॥ పరుషవాక్కులు చెలరేగి - పలకనయ్యె
చూపులన్నియు మోహంపు - తూపులయ్యె
వీనులెప్పుడు చెడుగునే - వినగనయ్యె
అంధకారంబు హృదయంబు - నల్లుకొనియె

తే॥గీ॥ నడతలన్నియు వికృతి - నడతలయ్యె
సన్నగిలెనీతి కడకు మరి - సున్నయయ్యె
వేషధారణ జీవిత - వేషమయ్యె
బ్రతుకు తెరవులో పాపపు - భయముపోయె

గీ॥ అంధకారంబులో దిరుగ - నాటయయ్యె
సాధు జీవితమది వెడలి - సాగిపోయె
మృత్యుభయమన్న మది - నిర్లక్ష్యమయ్యె
శిధిలమైపోయె భయభక్తి - జీవితమున

గీ॥ చెడ్డబుద్ధులు మదిలోన - చేరినపుడు
దొడ్డబుద్ధికి దారేమి - దొరకగలదు?
అడ్డమైనట్టి పనులలో - అలసిపోయి
గడ్డుక్రియలలో జీవనము - కరిగిపోవు

గీ॥ లోకులందరి యెదలోన - లోకువయ్యే
బంధువర్గంపు ప్రేమను - బొందదయ్యే
మిత్రులక్కట మరికలసి - మెలగరయ్యే
గౌరవంబెల్ల మంటిలో - కలసిపోయె

గీ॥ పాపమున కెట్టివారయిన - పట్టుబడిన
పాముకరచిన రీతి - పట్టి కరచు
నాశనముచేయు లోకాన - యాశలన్ని
ఆత్మజీవితమంతయు - నార్పివేయు

గీ॥ యేసుక్రీస్తుండు హృదయమును - ఏలునపుడు
నీతిసూర్యుడు నీలోన - నిలిచినపుడు
తేటముగ జీవితంబెల్ల - తేజమగును
క్రీస్తురూపంబు నీలోన - కలుగునపుడు

## 20. దుష్టసాంగత్యము మంచి నడువడిని చెరుపును

**(1 కొరి 15:33)**

గీ॥ చెడ్డవారితోడ - చెలిమిచేసినపుడు
దొడ్డబుద్ధినీలో - తొలగిపోవు
అడ్డదారులు పడి - అలసిపోదువు
మరి మడ్డిబురదల చిక్కి - మాయమగుదువు

గీ॥ దొంగబుద్ధులు నీలోన - సంగమించి
బాసిపోదువు సంఘాన - మోసకుడిగ
లొంగదీతురు పోలీసులు - లోకమంత
దొంగవాడని చెప్పుదురు - దేశమంత

గీ॥ తోటివారలు నిను జూచి - తొలగిపోరె
మాటలాడరు నీతోటి - మమతలేక
సాటివారలు వారితో - చేరనీరు
నీచమగుదువు ధరలోన - నీడలేక

గీ॥ దుష్టసాంగత్యమీరీతి - దూరపరచె
మానవత్వంబు భువినిన్ను - మరిచిపోయె
అష్టకష్టాలు నీచుట్టు - ఆవరించె
దిక్కులేకుండ లోకాన - తిరుగునీవు

గీ॥ దైవభయమన్నది, నిన్ను - దాటిపోగ
అంధకారంబు మదినిండ - అల్లుకొనియె
చెడుగుమది నిండునట్టుల - చేరుకొనియె
పరులుకాపద జేయంగ - పరుగు లిడియె

గీ॥ దొంగపనులను జేయంగ - లొంగిపోయె
తల్లిదండ్రుల యెడభక్తి - తొలగిపోయె
అక్కజెల్లెండ్ర వస్తువుల - నమ్ముకొనగ
అన్నదమ్ములప్రేమంత - సున్నయయ్యె

గీ॥ దురభి మానంబు తనకొక - దారియయ్యె
వేశ్యగృహములు నీకొక - విడిదియయ్యె
హంతకుల చేరుకొనుపని - ఆటయయ్యె
పాపమే చేరబడుటకు - పాన్పుయయ్యె

గీ॥ కక్కి తనవాంతి తిన్నట్టి - కుక్కరీతి
ప్రకృతిని వీడకున్నట్టి - పందిరీతి
సిగ్గులేకుండ తిరిగేటి - చెనటెరీతి
తిరుగుచున్నావు భువిని నీవు - స్థిరములేక

గీ॥ మగతనబంత నీలోన - మాసిపోయె
పౌరషగుణములు నీనుండి - పారిపోయె
ధీరమగుబుద్ధి నీలోన - తరిగిపోయె
కడకుజంతువుతో నీబుద్ధి- కలసిపోయె

గీ॥ పట్టుబడితివి పోలీసు - పగ్గములకు
కూలదోసిరి భువిపైన - కొట్టికొట్టి
దారిపోయినవారెల్ల - దయయులేక
మంచిపని యైనదని చెప్పి - మసలిచనిరి

గీ॥ లేవదీసిరి పోలీసు - చావతన్ని
శృంఖలంబులు చేతులకు - బింకముగను
తొడిగి కారాగృహమందు - త్రోసినారు
దుష్టస్నేహంబు నిన్నెంతో - త్రోసిపుచ్చె

గీ॥ జూదమాడిన స్నేహితుల్ - చూడరారు
త్రాగుబోతులగు మిత్రులు - దరికి రారు
వేశ్యగృహముల తిరిగినా - వేశ్యలంత
కిలకిల నవ్వుకొనరే నీ - కీడువినగ

గీ॥ తప్పుజేసియు మేమెపుడు - దొరికిపోము
మించిపోయిన మామూళ్ళు - పంచిపెట్టి
మాయమయిపోదుమయ్య - మరుక్షణమున
తెలివితేటలులేనపుడు - దొరికిపోమ

గీ॥ తప్పుచేసితిననిచెప్పి - ఒప్పుకొంటె
తప్పదని శిక్షవానికి - తెలియదేలా
కర్మమీరీతి వానిని - కట్టిగుడుప
తప్పిదము మాదికాదని - తప్పుకొనిరి

గీ॥ ఎంతకాలంబు నీకీ - వింతబ్రతుకు
మనిషిగామారలేనట్టి - మాయబ్రతుకు
సంఘమునకు దూరమైనట్టి - చవట బ్రతుకు
ఈ సడలిపోవునట్టి యీ - హీనబ్రతుకు

గీ॥ మదిని తలపోసి బాగైన - విధముతెలిపి
మనిషిగా మారిపోవేల - మనసుమారి
వెర్రిభావాలు నీనుండి - వెడలగొట్టి
పరితపించుము నీ లో - స్వభావములకు

గీ॥ దుష్టసాంగత్యమున కీవు - దూరముండు
పాప కార్యముల కీవు - పరుగులిడకు
చెడుగునీలోన యెపుడైన - చేరనీకు
తప్పుమార్గాల నడచుట - కొప్పుకొనకు

గీ॥ చెడ్డవారితో స్నేహంబు - చేయకున్న
మంచిజీవితము నీలోన - మలచుకొనును
సంఘమే నిన్ను పిలచి - స్నేహంబుచేయు
నమ్ముదురు నిన్ను ఎవరైన - నవనియందు

గీ॥ చపలబుద్ధిని విడనాడి - చేరుకొనుము
పాపిరక్షకుడైనట్టి - ప్రభునికడకు
ఎంతటిపాపినైనను - సంతసమును
ప్రేమతో నాదరించు నా - ప్రేమమూర్తి

గీ॥ మధిలోనున్నట్టి కల్మషము - మాపుచేసి
నీతిమార్గాన నడిపించు - నిరతమతడు
శిక్షపడకుండ కాపాడు - రక్షకుండు
యేసు, నామాన లోకాన - వెలసినాడు

గీ॥ పాపములతోడ బంధింప - బడిన మనకై
పుడమికరుదెంచినాడా - పుణ్యమూర్తి
పిలుచుచున్నాడు - పాపులను ప్రేమతోడ
ఆత్మశుద్ధిని జేతునని - అవనియందు

గీ॥ తనదు స్వరమును వినగానె - తక్షణముగ
పాపబుద్దులు మననుండి - పారిపోవు
నూతనంబగు బ్రతుకంత - ఖ్యాతికలుగు
రూపమంతయు యేసుని - రూపమగును

గీ॥ పాతస్నేహితులు నీకడకు - పరుగులిడరు
పాతజీవితమంతయు - బాసిపోవు
నూతనంబైన సృష్టిగ - నిలిచిపోదు
క్రీస్తుయేసునితోనీవు - కలసినపుడు

గీ॥ క్రీస్తురూపంబు భువినీకు - కీర్తితెచ్చు
సత్యమే నీతో జీవమై - నిత్యముండు
యేసుభక్తులతో నీవు - ఏకమౌదు
రక్షనానందంబది నీలో - రగులుకొనును

గీ॥ కొంటెబుద్దులు నాలోన - కుంటుపడెను
మాయబుద్దులు నాలోన - మాయమయ్యెను
దుష్టసాంగత్యమంతయు - దూరమగును
క్రీస్తుప్రభువు చేరినంత - కీర్తిగలిగె

గీ॥ ప్రభునికెన్నడు మనపై ప - రాకులేదు
రక్షకునికెపుడు పాపిపై చి - రాకులేదు
వెదకిరక్షించు పాపిని - వేదమూర్తి
పాపులను వక్షమునచేర్చు - ప్రేమమూర్తి

గీ॥ దయనుచూపించు తనదు - పాదములబట్టి
ప్రార్ధనలు చేయువారిపై - ప్రీతికలిగి
శరణుదూరిన మనపైన - కరుణకలిగి
శరణునిచ్చి దయను - నా కరుణ మూర్తి

గీ॥ సిలువపై నతడే మనకొరకు - శ్రమలతోడ
రక్తబింధువులెన్నెన్నో - రాల్చినాడు
పాపిరక్షణకిది యొక - బలి యనంగ
వేదగ్రంధములన్ని నెర - వేర్చినాడు

గీ॥ వేగముగాలేచి క్షుద్ర జీ - వంబు విడిచి
పరుగుపరుగున పోవయ్య - ప్రభునికొరకు
వేచియున్నాడు నీకొరకు - వేయికనుల
జాలిహృదయాన నిను తనలో - చేర్చుకొనగా

## 21. యదార్ధము

సీ॥ చెడ్డవారినిగూడి - చెలగాటమాడిన
మంచితనమునాలో - మాయమగును
దుష్టసాంగత్యంబు - దురితంబు కలిగించు
నష్టమొందుదు నేను - కష్టమునకై
నవ్వులపాలగుదు - కవ్వింతు రందరు
మోసకారి నగుదు - దోషములతో
భక్తిమర్యాదలు - బాసిపోయిననాడు
నేరస్తునుగనేను - నిలిచిపోదు

గీ॥ అకటనా కేల యీగతి - ఆవరించు
క్షుద్రజీవంబునాకేల - శోభపెట్టు
బ్రతుకుతెరువులు నానుండి - బాయనేల
కలుషమైపోవ నేల యీ - కాలమంత

సీ|| ఒల్లుకొవ్వెక్కి నా - తల్లిమాటలు మరచి
వద్దన్నవారితో - బుద్ధిలేకద
సిగ్గువిడిచి బ్రతుకు - శీలంబులేనట్టి
కులటిని పెండ్లాడ - కూడినాను
తరువాత తెలిసెను - దాని బ్రతుకంతయు
హృదయము బాధతో -వదలదయ్యె
మరణము ననుజేరి - మాయజేయువరకు
మరుపురాని వేదన - మనసునందు

గీ|| కలిగియున్నానుపైకి - కానబడక
నీవుచేసిన మోసంబు - నేటివరకు
పట్టి పీడించుచున్నది - పగలురాత్రి
బ్రతుకుచున్నాను - జీవచ్ఛంబునై, భువిని నేను

గీ|| చెడితినని నేను ఎవరితో - చెప్పలేను
తప్పితము నాదని నేను - ఒప్పుకొందు
బ్రతుకుచున్నాను - భారముగను
తప్పుకొనలేను నే జేయు - తప్పితమును.

## 22. కల

సీ|| పొదుపుగా మనమపుడు - నిదురపోయిననాడు
పోతరించిన మనసు - పొంగునాడు
ముద్దుబిడ్డల గని - మురిసిపోయిననాడు
ఉయ్యాలయందుంచి - వూపునాడు
బడిలోన చదువులో - పట్టమొందిననాడు
ఉద్యోగములు చేయు - చున్ననాడు
పెండ్లియాడని తలచి - పెండ్లిచేసిననాడు
పరివారమైవారు - పరగునాడు

తే॥గీ॥ తగిలి మనసులో వాటిని - తలచునాడు
తోటివారితో ముచ్చటిగ - తెలుపునాడు
యెన్నియేడులు గడిచెనో - యెరుగలేదు
కలలుగన్నటుల హృదయాన - కలిగెనేడు

## 23. కులభేదములు

గీ॥ కాకి కోకిల బేధమ్ము - కలది గాదె
పక్షి జౌతంత ఒక్కటని - పలుకగలమె
రంగులో భేదమే లేదని - ఋజువు గలదే
పలుకు నందున గలదయ్య - బేధమంత

గీ॥ కావుకావంది యా - చిన్నకాకిపిల్ల
కుక్కూయంది యా చిన్న - కోకిలమ్మ
కాకి గూటిలో పెరిగింది - కాని దాని
కోకిలని తెలిసికొనగానె - కాకితరుము

గీ॥ జంతు జౌలములొకటని చెప్పలేము
వాటిలో బేధములెన్నో - వెలసెగాదె
ప్రాకుజీవులొకటని - పలుక గలమె
వాటియందున బేధములు - వెలసెగాదె

గీ॥ వృక్షములన్ని యొకటని - ఋజువుచేయ
బేధములు కానిపించును - ఫలములందు
బేధములు లేవని మనము - పలుకగలమా
సృష్టికర్తది తప్పని - చెప్పగలమా

గీ॥ మానవులందరొకటని - యనగ తగదు
వారిలో రంగు బేధముల - వరుసలేదె
మానవులందరు ఒకటన్న - మాటలాడ
నానుడయ్యెను ప్రజలలో - నేటివరకు

గీ॥ స్టేజిలెక్కుదు రెందరో - లీవిగాను
మనమందర మొకటన్న - మాటపలికి
స్టేజి దిగగానే తనవారి - జేరుకొంద్రు
బుద్ధిగలవారె యనుకొందురు - పెద్దలంత

సీ॥ మతజాతి బేధములు మంట - గలపక పోతె
శాంతి దేశము నెట్లు - చక్కపరచు
ధనికులెల్లరు తమ ధనము - పంచకపోతె
బీదరిక మదియెటుల - పారిపోవు
దేశ భక్తులెల్ల దోపిడి - చేస్తుంటె
దేశాభివృద్ధి యెటుల - తేజరిల్లు
ప్రజలలో నైక్యత ప్రబలి - యుండకపోతె
సమభావమెట్టుల - సాగిపోవు

గీ॥ భాష భేధముల్ - పట్టువదలి
వెర్రిభావంబులన్నియు - వెనకబెట్టి
ప్రేమ మనసుతో ద్వేషాన్ని - పారద్రోలి
పథమునందున నడిచెడి - బాగ్యమెపుడో

(29-11-1983)

## 24. మగ్దలెనె మరియ

(25-12-1982)

గీ॥ గగన వీధుల తిరుగాడు - ఖగమువలెను
దిక్కులేకుండ దేశాన - తిరుగుచుంటి
ఏడు దయ్యాల దాసినై - వెలసియుంటి
అందమంతయు జనుల - కమ్ముకొనుచు

గీ॥ కుక్కరీతిని జనులకు - చిక్కిపోతి
శీలమంతయు దోచిరి - హీనముగను
యెవరినైనను పట్టుకొని - ఎంగిలగుచు
కాలమును గడుపుచుంటిని - కడుపుకొరకు

గీ॥ రూపమంతయు పోయి కురూపినైతి
శోకపూరితమైన ఏ-కాకినైతి
పాడుపడిపోతి సృష్టిలో - పనికిరాక
తెగిన గాలిపటమైతి నీ - ధరణిమీద

గీ॥ సాటిలేనట్టి రూపంబు - సరగగూర్చి
శిల్పిగా చెక్కినట్టి యా - సృష్టికర్త
నెపుడు తలపోయకుంటి నా - తలపునందు
దారిపోవుచు, నను జూచె నా - దివ్యమూర్తి

గీ॥ పాపినెతుకుచు తిరుగాడు - భవ్యమూర్తి
ప్రేమ నదులుగాపారె నా - ప్రభునియందు
ముద్దుగా నన్ను బిలిచెను - మగ్దలనుచు
పాదములపైని పడిపోతి - పరితపించి

గీ॥ పరువులేకుండ బ్రతికిన - పడతియనక
శిష్యురాలిగ తనవెంట - చేరదీసె
సాగిపోతిని వెంటనే - యోగినగుచు
భక్తిమార్గాన నడిపెడు - పాపహరుని

గీ॥ పాపియనగనె నీకెంత - ప్రీతి ప్రభువా
పాప భారంబు నీపైన - మోపుకొనుచు
రక్షణానంద మొసగుదువా - శిక్ష నీయక
మగ్దలను మరియ నీ కయ్యె - ముద్దుబిడ్డ

గీ॥ పాపియందున నీకెంత - ప్రీతి ప్రభువా
పాప భారంబు నీపైన - మోపుకొనుచు
రక్షణానంద మొసగుదువా - శిక్ష నీయక
మరియ తనయుండ - నిన్నెటుల మరతునయ్య

గీ॥ చిందించితివిగావె రక్తంపు - బిందువులను
సిల్వపై గొల్గొతా స్థలము - చేరినపుడు
లోకమందున్న పాపుల - చీకటులను
తొలగజేసితివి రక్షణ - వెలుగు కలుగ

గీ॥ ఏలకో యెరుగకున్నారు - వెర్రిప్రజలు
మారు మనసును పొంది యా - దారినడువ
మగ్దలను మరియ యొకతియె - మరపురాని
శిలువ నీడలో నినుజూడ - చేరుకొనదే

గీ॥ సొమ్మసిల్లుచున్న సమయాన - అమ్మయనుచు
పిలిచితివిగాదె తల్లిని - ప్రీతితోడ
భక్తితో నిన్ను సేవించు - భక్తురాలు
మగ్దలను మరియ నేలకో - మరచినావు

గీ॥ దూరమున నిలిచి నీ బాధ - చూడలేక
ఏడ్చుచున్నారు కన్నీళ్ళు - ఏరులగుచు
పాదసేవను జేసిన - భక్తిరాండ్రు
మరియ తనయుండ వారల - మరచినావో!

గీ॥ నలువదేడులు నీసేవ - నాణ్యముగను
చెప్పరానట్టి శ్రమలొంది - చేసినాను
మూడు సంఘాలు నీకై - మలచినాను
మరియు తనయుండ నను గూడ-మరతువేమో..!